

# అక్కడే ఆగక

- మల్లాది వెంకట కృష్ణమూర్తి

(గత సంచిక తరువాయి)

చైత్ర ఎల్లో ఫీవర్ వేక్సినేషన్ని హైద్రాబాద్‌లో ఎక్కడ వేస్తారో ఇంటర్నెట్లో చెక్ చేసి, చెల్లెలి పేర ఆన్‌లైన్‌లో ఆ వేక్సినేషన్‌కి అపాయింట్‌మెంట్ బుక్ చేసింది. మంగళవారం, శుక్రవారం మాత్రమే ఎల్లో ఫీవర్‌కి వేక్సినేషన్ వేస్తారని తెలుసుకున్న చైత్ర, డాలీపేర శుక్రవారానికి అది బుక్ చేసింది. సంజీవ శుక్రవారం సెలవుపెట్టి ఆద్యని నారాయణగూడ లోని బ్లడ్ బేంక్ పక్క బిల్డింగ్ ఆవరణలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసన్ బిల్డింగ్‌లో ఇంటర్నేషనల్ వేక్సినేషన్ సెంటర్‌కి తీసుకువెళ్ళడు. ఆద్య నోరు మెదపకుండా బొమ్మలా వాళ్ళ వెంట వెళ్ళింది.

"ఏ దేశానికి వెళ్తున్నారు?" వేక్సిన్ని ఫ్రిజ్‌లోంచి తీసిన ఉద్యోగి అడిగాడు.

"ఘానా" సంజీవ చెప్పాడు.

ఆద్యకి వేక్సినేషన్ ఇంజెక్షన్‌ని చేతికి ఇచ్చాడు. అరగంటలో డాక్టర్ సంతకం చేసిన ఓ పసుపుపచ్చ వేక్సినేషన్ సర్టిఫికెట్ కార్డ్‌ని ఇచ్చాడు. అతను కోరిన టిప్‌ని సంజీవ ఇచ్చాక అతను చెప్పాడు.

"దీని వేలిడిటీ పదేళ్ళు. ఆఫ్రికాలో కొన్ని దేశాలకి దీన్ని తప్పనిసరిగా తీసుకెళ్ళాలి."

అక్కడనించి ముగ్గురూ నారాయణగూడాలోని తాజ్‌మహల్ హోటల్‌కి వెళ్ళారు. భోజనం చేస్తూండగా చైత్రనించి సంజీవకి ఫోన్ వచ్చింది.

"వేక్సినేషన్ పనైందా నాన్నా?" అడిగింది.

"ఇప్పుడే అయింది. హోటల్లో భోజనం చేస్తున్నాం. భోజనం అయాక డిమార్ట్‌కి వెళ్ళి నువ్వు చెప్పిన థర్టీ టు ఇంచెస్ అమెరికన్ టూరిస్టర్ సూట్‌కేస్ కొంటాం."

"అదే కంపెనీ కేరీ ఆన్ కూడా కొనండి."

"అలాగే. ట్వంటీ టు ఇంచెస్ కదా? ఆ వివరం కూడా రాసుకున్నాను."

"లిజ్జత్ గార్లిక్ పాపడ్, పంజాబీ మసాలా పాపడ్, స్వగృహలో పచ్చళ్ళు, ఆవాలులాంటి తాలింపు సామాను, ఉప్మా రవ్వ, శనగపిండి, కందిపప్పు, చింతపండు.. లిస్ట్ అమ్మకి పంపాను. రేపు తెల్లవారుఝామునే ప్రయాణం. ఏదీ

మర్చిపోకుండా అన్నీ పంపండి. నిడదవోలునించి కొత్తపల్లి స్వీట్స్ తెప్పించారా? మా కొలీగ్స్ కోసం. కొత్తపల్లి స్వీట్స్ డాట్ కామ్ లోకి వెళ్ళి ఆన్‌లైన్‌లో ఆర్డర్ చెయ్యమని అమ్మకి చెప్పాను."

"ఆర్డర్ చేసాను. టెన్నిస్ బాల్ దేనికి?" సంజీవి అడిగాడు.

"విమానం సీట్లు బాగా చిన్నవి. కాలుసరిగ్గా చాపుకునేంత చోటు ఉండదు. కొన్ని గంటలపాటు కదలకుండా కూర్చోవడం బ్లడ్ సర్క్యులేషన్‌ని ఇంప్రూవ్ చేస్తుంది. ఈ సెల్ఫ్ మాసేజ్ పక్కవాళ్ళకి ఇబ్బందికూడా కలిగించదు. డాలీ ఆరోగ్యం ఎలా ఉంది?"

"నీరసంగా ఉంది. కొంత మతిమరుపు వచ్చింది. దాని ఫ్రెండ్ హవిష్య వస్తే వెంటనే గుర్తుపట్టలేదు. చాలాసేపు మర్చిపోయింది. ఐతే అది షార్ట్ టర్మ్ అని డాక్టర్ చెప్పాడు."

"థాంక్ గాడ్! వి ఆర్ బ్లెస్డ్."

షాపింగ్ పూర్తి చేసుకుని వాళ్ళు ఇంటికి చేరుకునేసరికి చీకటి పడుతోంది.

ప్రవర్ధన మొబైల్‌కి మర్నాడు ఘానాలోని టకరోడినించి ఫోన్ వచ్చింది.

"ఇవాళే ప్రయాణం. అది మేలుకుని ఉందా? స్పీకర్ ఫోన్ ఆన్ చెయ్యి."

ప్రవర్ధన ఆన్ చేసాక చైత్ర కంఠం వినపడింది. చైత్ర మళ్ళీ చెల్లెలికి ట్రావెల్ ఏర్పాట్ల గురించి చెప్పింది.

"డాలీ! నేను చెప్పేది జాగ్రత్తగా విను. ఇవాళ ఇంట్లోంచి రాత్రి ఏడుకి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి బయల్దేరతావు. ఏర్ ఇండియాలో ఢిల్లీకి చేరుకోవాలి. లక్కీగా ఢిల్లీలోకాక హైద్రాబాద్‌లోనే నీకు ఇమిగ్రేషన్ జరుగుతుంది. ఇమిగ్రేషన్ అధికారి ఎందుకు వెళ్తున్నావని అడిగితే, 'సెలవలకి అక్కని విజిట్ చెయ్యడానికి ' అని చెపితే చాలు. ఆక్రాలో కూడా అదే చెప్పు. నీకు ఐటినరీ ప్రింటవుట్‌లో మొత్తం వివరంగా రాసి ఉంది కాబట్టి విమానం మారాల్సిన ప్రతీచోట గేట్ తెసుకుని సెక్యూరిటీ చెక్‌కి వెళ్ళి, అక్కడనించి డిపార్చర్ లాంజ్‌కి వెళ్ళు. ప్రతీచోటా  విమానంలో నీవెంట తీసుకెళ్ళే కేరీ ఆన్ లగేజ్‌ని తీసుకుని దిగాలని మర్చిపోకు. ఢిల్లీలో ఇంటర్నేషనల్ ఏర్‌పోర్ట్‌లోనే దిగాలని ఏర్ ఇండియాలో బుక్ చేసాను. మిగతావి నేషనల్ ఏర్‌పోర్ట్‌లో దిగుతాయి. మళ్ళీ షటిల్ బస్‌లో అక్కడికి మారాల్సి వస్తుంది. ఇంటర్నేషనల్లో దిగగానే నువ్వు హైద్రాబాద్‌లో బుక్ చేసిన లగేజ్‌ని తీసుకుని, తిరిగి సెక్యూరిటీ చెక్‌లోంచి ఏర్‌పోర్ట్‌లోకి వెళ్ళు. అక్కడ ఫ్రీ వైఫై ఉంటుంది. వెంటనే ఏర్‌పోర్ట్‌లో ప్రయాణికులకి ఇచ్చే ఫ్రీ ఇంటర్నెట్‌కి కనెక్ట్ అయి, అమ్మకి క్షేమంగా చేరానని ఫోన్ చేసి చెప్పు. అర్థమైందా?"

"ఆ" ఆద్య ఉదాసీనంగా చెప్పింది.

6

హైదరాబాద్‌లో ఆద్య బయలుదేరిన విమానం ఢిల్లీలోని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లో దిగాక బయటకి వచ్చి ఫ్రీ ఇంటర్నెట్‌లో కనెక్ట్ అయింది. పది నిమిషాలకి చైత్రనించి ఆమెకి వాట్సప్ ఫోన్ కాల్ వచ్చింది.

"నీ విమానం లేండైంది. చెక్ చేసాను" చెప్పింది.

"అవును. ఇప్పుడే ఐంది."

"గుడ్. విమానంలోంచి నీ కేరీ ఆన్ తీసుకున్నావా? అది నీ దగ్గరుందా?"

"ఉంది."

"వెరీ గుడ్ ఇక్కడ నువ్వు  నీ సామాను కలెక్ట్ చేసుకో. ఏర్ ఇండియా కౌంటర్లోని ఉద్యోగస్థులని అడిగితే కేరసోల్ నంబర్ చెప్తారు. అక్కడికి వెళ్ళి దాన్ని తీసుకుని బయటకి వెళ్ళకు. ఇంపార్టెంట్. ఎగ్జిట్ గేట్లోంచి బయటకి వెళ్ళొద్దు. ఇంటర్నేషనల్ ట్రాన్స్‌ఫర్స్ అనే బోర్డ్ కోసం చూడు. దానికున్న బాణం గుర్తులని ఫాలో అవు. దారిలో సెక్యూరిటీ గార్డ్ నీ పాస్‌పోర్ట్ ని చెక్ చేసి అక్కడికి పంపుతాడు. అనుమానం ఉంటే షాపుల్లోని వారిని అడుగు. ఎస్కలేటర్, లిఫ్ట్ ఉపయోగిస్తే నువ్వు సరైన దారిలో వెళ్తున్నట్లు. డిపార్చర్స్ ఏరియాకి చేరుకున్నాక ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ కౌంటర్‌కి వెళ్ళు. నీ ఫ్లైట్ల నంబర్ ఇటి 687."

ఆద్య పావుగంటలో ఆ పనిచేసింది. మళ్ళీ చైత్రనించి ఫోన్ వచ్చింది.

"అక్కడికి చేరుకున్నావా? గుడ్. నీ మొబైల్లో బేటరీ ఎంతుంది? ఏభైలోపుంటే ఛార్జ్ పెట్టుకో. అక్కడ చాలా ఫ్రీ పోర్ట్‌లు ఉంటాయి. నీ గేట్ దగ్గర చాలా కుర్చీలుంటాయి. ఒకదాంట్లో కూర్చో, ఆడిస్ అబాబాకి నీ విమానం డిపార్చర్ తెల్లారుఝామున మూడింటికి. నిద్రొస్తే జారగిలబడి నిద్రపో. అది నాన్ స్టాప్ విమానం. ఏడుగంటలు ప్రయాణించాక అది ఆడిస్ అబాబాకి లోకల్ టైం ఉదయం ఏడున్నరకి చేరుకుంటుంది."

చైత్ర కాల్ కట్టవగానే ఆద్య ఫోన్ మళ్ళీ మోగింది. తల్లినించి. కట్ చేసి కుర్చీలో వెనక్కివాలి కళ్ళుమూసుకుంది.

రెండున్నరకి ఆద్య మొబైల్ మోగింది. చైత్రనించి.

"డాలీ! నిద్రపోయావా?"

"ఆ. నీ కాల్‌కే మెలకువ వచ్చింది."

"గుడ్, చుట్టుపక్కల మానిటర్ ఉంటుంది. అందులో నీ గేట్ మారిందేమో ముందు చూడు."

"అదే గేట్" చూసి ఆద్య చెప్పింది.

"గుడ్. వెళ్ళి క్యూలో నించో. ఇంకొద్దిసేపట్లో గేట్ ఓపెన్ చేస్తారు. మొత్తం రెండు బోర్డింగ్ పాసులు ఇస్తారు. చెక్ చెయ్. ఢిల్లీనించి ఆడిస్ అబాబాకి, అక్కడినించి ఆక్రాకి. లగేజ్‌ని ఆడిస్ అబాబాలో తీసుకోనక్కర్లేదు. వాళ్ళే దాన్ని ఆక్రా విమానంలోకి ఎక్కిస్తారు."

"అది నువ్వు పంపిన ప్రింటౌట్లో  చదివాను."

"దాన్ని ఫాలో అవుతున్నావన్నమాట. గుడ్. నీ లగేజ్ రసీదు ఆక్రా బోర్డింగ్ పాస్ వెనక అతికిస్తారు. చెక్ చేసుకో బోర్డింగ్ పాస్‌లోని గేట్ నంబర్‌ని చూసి ఆ గేట్‌కి వెళ్ళు. గేట్ నంబర్ల సైన్ బోర్డులు నీకు కనిపిస్తాయి. వాటిని ఫాలో అయితే చాలు. అనుమానం వస్తే హెల్ప్ డెస్క్‌లోని వాళ్ళని అడుగు. నీ గేట్‌లోని డిపార్చర్ లాంజ్ కి చేరాక నాకు టెక్స్ట్ మెసేజ్ పంపు."

"అలాగే."

తను ఇండియాని వదిలి వెళ్తోందన్న ఆలోచనతో ఆద్య జినేంద్ర వాట్సప్‌లో ఆన్‌లైన్‌లో ఉండటం గమనించి ఓ మెసేజ్‌ని పంపింది.

'నువ్వు నా హృదయాన్ని బద్దలు కొట్టావు.'

ఆమె ఓ షాప్‌లో హెర్షీస్ చాక్లెట్ పాకెట్‌ని కొని తింటూ కసిగా బయటకి చెప్పింది.

"నువ్వు లేవు సాయిబాబా! అందరిలా సాధారణ మనిషివి. ఏదా నువ్వు నాకు సహాయం చేయదలచుకోలేదు. కాబట్టి ఎలా చూసినా నువ్వు నాకు లేవు."

విమానం ఎక్కేముందు చూస్తే అతన్నించి జవాబులేదు. మరో మెసేజ్‌ని పంపింది. 'నేనూ నీ హృదయాన్ని బద్దలుకొట్టి బదులు తీర్చుకుందామంటే నీకు అది లేదు' వెంటనే అతను ఆఫ్‌లైన్ వెళ్ళిపోవడం గమనించింది.

ఆద్య విమానం ఎక్కబోయేముందు చైత్ర ఆడిస్ అబాబాలో దిగాక ఫ్రీ ఇంటర్నెట్‌కి కనెక్ట్ అవమని టెక్స్ట్ మెసేజ్ పంపింది. విమానంలో కూడా ఆద్య దుర్భర నిరాశనించి పుట్టిన ఏడుపుని ఆపుకోలేకపోయింది. అది గమనించిన డెబ్బై పైబడ్డ ఓ తెల్లజాతి వ్యక్తి దిగేప్పుడు ఆమెతో చెప్పాడు.

"టేకిట్ ఈజీ మై ఛైల్డ్. మన జీవితం కొనసాగడానికి గజిబిజి ముఖ్యం. ఇసిజిలోని సరళరేఖ కూడా పైకి, కిందకి పోకపోతే మనం జీవించిలేమని చెప్తుంది. జీవితంలో ఒడిదుదుకులు వచ్చినప్పుడు ఇది గుర్తుంచుకోవాలి."

ఆద్య ఆడిస్ అబాబాలో దిగిన పది నిమిషాలకి మళ్ళీ టకరోడీలోని చైత్రనించి ఆద్యకి వాట్సప్ కాల్ వచ్చింది.

“నీ కేరీ ఆన్ పెట్టె నీ దగ్గరే ఉందిగా?"

"ఉంది."

"విమానంలో నిద్రపోయావా?"

"లేదు."

"విమానంలో నాకూ నిద్రపట్టదు. ఇక్కడ బేగేజ్‌ని తీసుకోనక్కర్లేదు .ఆగ్రాకి వెళ్ళే నాన్ – స్టాప్ ఫ్లైట్ ఇటి 921 ఎక్కాలి. వెంటనే నీ ఫ్లైట్ నంబర్ని మానిటర్లో చూసి షెడ్యూల్ టైమా, ఆలస్యమా అన్నది చూసుకో. అది చాలా చిన్న ఏర్‌పోర్ట్ కాబట్టి ఎలాంటి అయోమయం ఉండదు. అది బయలుదేరాక ఐదు గంటల ఏభై నిమిషాలు విమానంలో కూర్చుంటావు. ఉదయం పదకొండున్నరకి ఆగ్రాకి చేరుకుంటావు. నిద్రపోక. విమనం ఎక్కేముందు నాకు టెక్స్ట్ మెసేజ్ పంపు."

బోర్డింగ్ టైం కాగానే చైత్రనించి ఫోన్ కాల్ రావడంతో కునుకు తీస్తున్న ఆద్యకి మెలుకువ వచ్చింది.

"నీ ఫ్లైట్‌కి డిలే లేదు. చూడు. బోర్డింగ్ ఇంకొద్దిసేపట్లో స్టార్టవుతుంది. వెళ్ళి క్యూలో నించోవడం మంచిది. ఇన్‌ఫ్లైట్ భోజనం నీకు నచ్చకపోవచ్చు. ఆకలిగా ఉంటే అమ్మ ప్లాస్టిక్ డబ్బాలో ఏదో పెట్టిచ్చానంది. అది తిను. ఆగ్రాలో దిగాక ఫ్రీ వైఫై కనెక్టవు."

7

ఆ రాత్రి సంజీవ తన భార్యతో చెప్పాడు.

"ఆద్య దారిలో ఎక్కడుందో కాని ఒక్కతే ఉందిప్పుడు."

"ఒక్కతేకాదు. దాంతోపాటు విమానంలో మరో ఎనభైమంది ఉంటారు."

"మనం పిల్లల్ని సరిగ్గా పెంచలేదేమోనని నాకు ఇప్పుడు అనిపిస్తోంది ప్రవర్ధనా" కాసేపాగి విచారంగా చెప్పాడు.

"అందరిలాగే పెంచాం. ఇంకెలా పెంచుతాం?"

"ప్రపంచం గురించి, మనుషులు గురించి, వయసొచ్చాక హార్మోన్స్‌వల్ల ప్రేమలో పడటం సహజమని, మనసుని నియంత్రించుకోవాలని మనం వాళ్ళకి బోధించలేదు. సరైన నిర్ణయాలు తీసుకోడానికి ఎలా ఆలోచించాలో, ఫైనాన్స్‌ని ఎలా మేనేజ్ చేయాలో నేర్పలేదు. దేశంలోని లంచగొండితనం గురించి,రాజకీయ పరిస్థితి గురించి,ఓ వ్యాపారాన్ని ఎలా ఆరంభించాలన్నది టీచ్ చేయలేదు. వాళ్ళకి బాటిల్స్‌మీది లేబిల్లో రాసుంది చదివి అర్థం చేసుకోవడం నేర్పించలేదు. స్కూల్లో, కాలేజీలో నేర్పించినవి వారికి జీవితంలో ఉపయోగపడేవి కావు. రాంబస్, ఏ స్క్వేర్ ప్లస్ బి స్క్వేర్.. ఏదీ."

"ఈ కాలం పిల్లలకవేం నేర్పించక్కర్లేదు. మన తరం వారికన్నా వీళ్ళకి తెలివి ఎక్కువ."

"అదే నిజమైతే ఈ తెలివితక్కువది ఆ పాడు పనిచేయకుండా ఇప్పుడు మనింట్లోనే ఉండేది కదా? ఆ జినేంద్ర మనీ బేంక్‌లో చాలా ఉండచ్చు కాని మోరల్ బేంక్‌లో నైతికంగా దివాలా తీసాడు" సంజీవ నిరాశగా చెప్పాడు.

8

ఆద్యా ఎక్కిన ఫ్లైట్ అక్రాలోని కొటోకా ఇంటర్నేషనల్ ఏర్‌పోర్ట్‌లో ఉదయం పదకొండున్నరకి దిగింది .ఆద్య అక్రాలో దిగి ఇంటర్నెట్‌కి కనెక్టైన పది నిమిషాలకి మళ్ళీ చైత్రనించి ఫోన్ కాల్ వచ్చింది.

"వెల్‌కం టు ఘానా. నీ కేరీ ఆన్ పెట్టెని మర్చిపోకుండా తీసుకున్నావా?"

"ఆ."

"గుడ్. విమానాశ్రయంలోంచి కుడివైపు బయటకి రావాలి. ఎడమవైపు గేట్లోంచి కాదు. ఇక్కడ నీ బేగేజ్‌ని కేరసోల్‌లో తీసుకోవాలి. నీకు ఫ్రీ ట్రాలీలు కనిపిస్తాయి. దాన్ని తోసుకుంటూ పక్కనే ఉన్న నేషనల్ ఏర్‌పోర్ట్‌కి రా. లక్కీగా నీ ఫ్లైట్ కేన్సిల్ కాలేదు. ఇన్ టైం. అక్కడ కౌంటర్లోకి వెళ్ళి నీ కేరీ ఆన్‌ని నీతో విమానంలోకి తీసుకెళ్ళు. సీ యూ సూన్."

ఆద్యని ఇమిగ్రేషన్ వాళ్ళు వేసిన రెండు ప్రశ్నలు. 'ఎందుకు వచ్చావు? వెంట ఎంత సొమ్ము తీసుకు వస్తున్నావు?' వాటికి జవాబులు చెప్పాక బయటకి వచ్చింది. అక్క చెప్పినట్లే నేషనల్ ఏర్‌పోర్ట్‌కి చేరుకుంది. గంటన్నర తర్వాత విమానం.

అక్రానించి టకరోడీకి వెళ్ళే అది కేవలం పన్నెండుమంది మాత్రమే పట్టే చిన్న విమానం. కౌంటర్లో సామాను బుక్ చేసి బోర్డింగ్ పాస్ తీసుకుని ఓ కుర్చీలో కూర్చుంది.

9

టకరోడీ విమానాశ్రయం తన ఇంటికి రెట్టింపు మాత్రమే ఉండటాన్ని ఆద్య గుర్తించింది.

చేతిలో కేరీ ఆన్‌తో వచ్చే ఆద్యని దూరంనించి చూడగానే చైత్ర చేతిని ఊపింది.

"హలో డాలీ" దగ్గరకి వచ్చాక చిరునవ్వుతో పలకరించింది.

ప్రయాణంతో మొహం వాడిపోయిన పంతొమ్మిదేళ్ళ ఆద్య బదులుగా నవ్వలేదు. అక్క తను చూసినప్పటికన్నా సన్నబడిందని ఆద్య గ్రహిస్తే, చెల్లెలు లావై, ఉండాల్సిన బరువుకన్నా కనీసం పదిహేను కిలోలు అదనపు బరువు ఉందని చైత్ర గ్రహించింది.

దగ్గరకి వచ్చాక చైత్ర తన పక్కన ఉన్న ఓ నల్లజాతి మధ్య వయస్కుడికి  తన చెల్లెల్ని పరిచయం చేసింది.

"నా చెల్లెలు ఆద్య. ఇతను డ్రైవర్ సైమన్."

"హలో మిస్ ఆద్యా. వెల్‌కం టు టకరోడి. హౌ ఆర్ యు?" అతను ఆమె చేతిలోని స్ట్రోలర్‌ని అందుకుంటూ చిరునవ్వుతో పలకరించాడు.

ఆద్య అతనివంక చూసింది పొడుగు చేతుల చెక్స్ షర్ట్‌ని జీన్స్ పేంట్లో ఇన్‌షర్ట్ చేసుకున్న అతను కారు నలుపు ఆఫ్రికన్. గుండు.

విమానంలోంచి దింపిన సామానుని రన్‌వే మీదనించి రెండు పెద్ద ట్రాలీల్లో తోసుకువచ్చి విమానాశ్రయం బిల్డింగ్ ముందు ఉంచారు.

"నీ సూట్ కేస్ ఏది డాలీ? సైమన్‌కి చూపించు" చైత్ర కోరింది.

ఆమె చూపించాక అతను దాన్ని కూడా తీసుకుని కార్ పార్కింగ్ వైపు నడిచాడు. అక్కడ రెండు జీప్‌లు, ఓ స్టేషన్ వేగన్ ఆగి ఉన్నాయి. అక్కా చెల్లెళ్ళు ఇద్దరూ ఎస్‌యువి దగ్గరకి వెళ్ళారు. అప్పటికే అతను సామానుని డిక్కీలో పెట్టి వెనక సీట్ తలుపులు రెండువైపులా తెరిచాడు. ఇద్దరూ కూర్చున్నాక అతను తలుపులు మూసి డ్రైవర్ సీట్లో కూర్చున్నాడు.

"థాం యు సైమన్" తలుపు మూయగానే చైత్ర డ్రైవర్‌కి చెప్పింది.

"యు ఆర్ వెల్‌కం మేమ్" అతను జవాబు చెప్పాడు.

ఎస్‌యువి ముందుకి కదిలింది. చైత్ర దారిలో తన తల్లికి ఫోన్ చేసి చెప్పింది.

"డాలీ చేరిందమ్మా...లేదు. ఇబ్బందేం పడలేదు."

"అమ్మయ్య! ఈ ఫోన్ కాల్‌కోసం నేను, నాన్న రెండుగంటలనించి ఎదురు చూస్తున్నామంటే నమ్ము" ఆవిడ అవతలనించి రిలీఫ్‌గా చెప్పింది.

"దానికిస్తాను ఉండు."

చైత్ర ఫోన్ ఇవ్వబోతే ఆద్య అక్క చేతిని పక్కకి తోసేసి కిటికీలోంచి బయటకి చూడసాగింది. చైత్ర చెల్లెలి చేతిలో తన మొబైల్‌ని ఉంచి చెప్పింది.

"మాట్లడు."

"హలో" ఆద్య ముభావంగా చెప్పింది.

"హలో తల్లీ! దారిలో ఏం ఇబ్బంది పడలేదుగా?" తల్లి కంఠం ఆత్రంగా వినిపించింది.

"లేదు."

"విమానం మారాలి కదా నాన్నకి ఒకటే కంగారు. అది మిస్సైతే ఏం చేస్తుంది? దానికి కొన్ని డాలర్లు ఇచ్చి పంపాల్సింది అని ఒకటే అనుకున్నారు."

"సరే. ఉంటాను."

మొబైల్‌ని తిరిగి చైత్రకి ఇచ్చేసింది.

"మొదటిసారి నేనీ ఊరుని చూసినప్పుడు గుంటూరు, విజయవాడలని చూసినట్లుగా అనిపించింది తప్ప ఆఫ్రికాలోని ఓ ఊళ్ళో ఉన్న భావన కలగలేదు. చూడు. సన్నటి రోడ్లు. అటు, ఇటు పెంకుటిళ్ళు, మేడలు. ఇళ్ళ రంగులు

కూడా ఇండియాలో వేసేలాంటి గోపీ రంగులే. రోడ్లమీది నల్లవాళ్ళని చూస్తేనే ఆఫ్రికాలో ఉన్న సంగతి గుర్తుకి వస్తుంది" చైత్ర కాసేపాగి చెప్పింది.

ఆద్య ఇంగ్లీష్‌లోని షాపుల పేర్లని చదివింది. బ్రైడ్ ఆఫ్ బెత్లెహెం టైలరింగ్ వర్క్స్. అది గమనించి చైత్ర చెప్పింది.

"బ్రిటీష్ వాళ్ళు ఘానా ప్రజలందర్నీ క్రిస్టియన్స్‌గా మార్చకముందు వీళ్ళు పాగన్స్. అంటే ప్రకృతి ఆరాధకులు తప్ప వీరికి మతం లేదు. నేడు ఈ దేశ ప్రజలు డెబ్బై శాతం మందికి పైగా క్రిస్టియన్లే. వీరిలో దైవభక్తి అధికం. చర్చిలు అధికం. వీధి వీధికీ ఉంటాయనుకో."

మగవాళ్ళు పేంట్ షర్ట్‌లలో, ఆడవాళ్ళు రంగు రంగుల గౌన్లు, స్కర్ట్, బ్లౌజ్‌లలో కనిపించారు.

పావుగంటలో ఆ బండి పెద్ద ఇనుప గేట్ ముందు ఆగింది. డ్రైవర్ హార్న్ కొట్టగానే సెక్యూరిటీ గార్డ్ కేబిన్‌లోంచి ఓ గార్డ్ బండిని చూసి గేటు తెరిచాడు. వేన్ లోపలకి వెళ్తుంటే గార్డ్ చెప్పాడు.

"వెల్ కం మేం."

"థాంక్స్ అలెగ్జాండర్" చైత్ర బదులుగా చెప్పింది.

లోపల పన్నెండు అడుగుల మేర అడ్డం, ముప్పై అడుగుల పేర నిలువుగా సిమెంట్ చేసిన విశాలమైన స్థలం. కుడివైపు పదడుగుల ఎత్తైన కాంపౌండ్ వాల్. సిమెంట్ చేసిన ఖాళీస్థలం. ఓ చిన్న గదిలోకి తలుపు దానికి ఎడమవైపు మూడు బిల్డింగ్స్. చైత్ర వేన్ దిగి తన హేండ్‌బాగ్‌లోంచి తాళం చెవుల గుత్తిని తీసుకుని మధ్య బిల్డింగ్‌వైపు నడిచింది. ఆద్య ఆమెని అనుసరించింది. తలుపు తాలం తెరవగానే డ్రైవర్ సామాను లోపలకి తెచ్చి పెట్టి అడిగాడు.

"యు వాంట్ మి టు వెయిట్ మేం?"

"నో థాంక్స్ సైమన్. దట్సాల్ ఫర్ టు డే."

"యు ఆర్ వెల్ కం మేం. సీ యు టుమారో."

అతను తలుపు దగ్గర ఆగి ఆద్యతో చెప్పాడు.

"వెల్ కం టు టకరోడీ ఎగైన్. టేక్ రెస్ట్."

వేన్ ఎక్కాక అతను లాగ్ బుక్‌లో ఏదో రాసుకుని, సెల్ ఫోన్‌లో మాట్లాడి వెళ్ళిపోయాడు. అతను లోపల ఉన్నది రెండు నిమిషాలే ఐనా వేన్ గేట్ లోపలకి రాగానే గేట్ మూసిన గార్డ్ మళ్ళీ గేట్ తెరిచి అతను వెళ్ళగానే మూసాడు. ఆ బండి నంబర్, అది వచ్చి వెళ్ళిన టైం, అందులో ఎవరొచ్చారో తన ముందున్న రిజిస్టర్లో నోట్ చేసుకున్నాడు. చైత్ర చెల్లెలితో చెప్పింది.

"డాలీ ముందు కాఫీ ఇస్తాను. తర్వాత స్నాక్ తిందువు గాని."

"స్నానం చేసేదాకా ఏం తినను. తాగను" ఆద్య ముభావంగా చెప్పింది.

"వైఫై పాస్‌వర్డ్ ఫ్రిజ్ మేగ్నెట్ కింద కాగితంలో ఉంది. ఇది ఇండియా కాదు. వైఫై స్పీడ్ చాలా తక్కువగా ఉంటుంది. మనకి దగ్గరలోనే ఓ జర్మన్ రెస్టరెంట్ ఉంది. అక్కడ ఫ్రీ వైఫై. స్పీడ్ బావుంటుంది. కావాలంటే నువ్వు నా ఐపాడ్ కూడా వాడుకోవచ్చు. నాన్న మొబైల్ ఆఖరి నాలుగు నంబర్లే దాని పాస్‌వర్డ్. టి.వి రిమోట్ టి.వి ముందే ఉంటుంది. నీకు కావాల్సిన ఛానల్ పెట్టుకో."

తన వైపు చూడటం కావాలని ఎవాయిడ్ చేస్తూ ఆద్య గదిలోని సామాన్నో, కిటికీలోంచి బయటికో చూస్తోందని గమనించిన చైత్ర చెప్పింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**
www.anandbooks.com
www.telugubooks.in